

'శ్రీరామనవమి వేడుకలను విజయవంతం చేయండి'

బాన్సువాడటౌన్, ఏప్రిల్15: పట్టణంలోని శ్రీరామకాలనీలో గల శ్రీరామ మందిరంలో బుధవారం నిర్వహించనున్న శ్రీరామనవమి వేడుకలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు రమాకాంత్‌రావు, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణమూర్తి భక్తులను కోరారు. ఆలయ ప్రధాన అర్చకులు మధుసూధనశర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి శ్రీ సీతారామచంద్రస్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారాముల కల్యాణం వైభవోపేతంగా జరగనుందని తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.



గెలుపే లక్ష్యంగా..

సరికొత్త వ్యూహాలు!



- జహీరాబాద్ పార్లమెంట్‌లో పట్టు సాధించేందుకు ప్రధాన పార్టీల పాట్లు
- సన్నాహక సమావేశాలు, ప్రచార ప్రణాళికలతో హడావుడి
- అధికార కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు
- ఎవరి వ్యూహం వారిదే..
- ప్రణాళికలు, ఎత్తుగడలతో ముందుకు..
- జిల్లాలో వేడెక్కిన రాజకీయం

కామారెడ్డి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో పట్టుసాధించే పనిలో ప్రధాన పార్టీలు వ్యూహరచన చేస్తున్నాయి. హ్యాట్రిక్ సాధించి ప్రధాని మోదీకి విజయాన్ని బహుమతిగా అందించాలని బీజేపీ అభ్యర్థి ఎంపీ బీబీ పాటిల్ గట్టి పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. రెండు పర్యాయాలుగా గెలుపొందినందున తిరిగి స్థానాన్ని తమ ఖాతాలో వేసుకోవాలని బీఆర్ఎస్ అధిష్ఠానం పావులు కదుపుతోంది. రెండోసారి విజయం సాధించాలని కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా ప్రధాన పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ప్రణాళికలు, ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నాయి. ప్రధాన పార్టీలు ఎత్తులకుపై ఎత్తులు వేస్తుండడంతో జహీరాబాద్ లోక్‌సభ ఎన్నికలు రసవత్తరంగా మారే అవకాశం ఉంది.

వ్యూహాత్మకంగా కాంగ్రెస్

జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో ఎలాగైన విజయం సాధించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ నాయకులు ప్రణాళికలు [illegible]దించుకుంటున్నారు. ప్రజల్లో పలుకుబడి ఉన్న నేతల [illegible]ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. ఇతర పార్టీలోని కీలక నేతలను చేర్చుకోవడం ద్వారా ప్రత్యర్థి పార్టీని బలహీనపరిచే పని మొదలుపెట్టారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ను వీడి ఇతర పార్టీలో చేరిన నేతలను తిరిగి రప్పించే ప్రయత్నాలు మొదలుపెట్టారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను పెద్దఎత్తున చేర్చుకుంటున్నారు. ప్రధానంగా కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై కాంగ్రెస్ అవిశ్వాసం పెట్టి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ ఖాతాలో పడేలా వ్యూహాలు రచించింది.

ఎత్తులకు పైఎత్తులు

జహీరాబాద్ బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న బీబీ పాటిల్‌ను పార్టీలో చేర్చుకుని టికెట్ కేటాయించిన బీజేపీ ఈసారి పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి అవసరమైన వ్యూహాన్ని రచిస్తోంది. అభ్యర్థి క్షేత్రస్థాయిలో పర్యటించి జనం మధ్యే ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు చెందిన పలువురు నేతలను పార్టీలోకి ఆహ్వానించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇక బీఆర్ఎస్ రాష్ట్రస్థాయిలో అధికారం కోల్పోవడంతో పార్టీ కార్యకర్తలు నిరుత్సాహానికి గురైనా లోక్‌సభ ఎన్నికలకు వారిని సన్నద్ధం చేసేందుకు నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తూ మేమున్నామంటూ రాష్ట్రనాయకత్వం భరోసా ఇస్తోంది. నియోజకవర్గాల వారిగా కార్యకర్తల సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలను సన్న ద్ధం చేస్తున్నాయి. కాన్ఫరెన్స్‌లు,సమీక్షల ద్వారా అలర్ట్ చేస్తున్నారు.

సరికొత్త వ్యూహాలతో..

గెలుపే లక్ష్యంగా ప్రధానపార్టీలు సరికొత్త వ్యూహాలతో ముందుకెళ్తున్నాయి. జహీరాబాద్ లోక్‌సభ స్థానంలోని అసెంబ్లీ నియోజకవర్గంలోని ముఖ్యనేతలతో సమన్వయ కమిటీలు, మండలాలు, గ్రామాలలో ఎన్నికల కమిటీల ఏర్పాటుచేసే పనిలో పడ్డాయి. ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి అమలు చేసిన పథకాలు,అభివృద్ధి పనులు చేపట్టబోయే పనుల గురించి ఓటర్లకు వివరించాలని కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌కు పిలుపునిస్తోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఇక బీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, మూడోసారి మోదీ ప్రధాని మోదీ అందిస్తున్న సుస్థిర పాలన గురించి వివరిస్తు విస్తృతంగా ప్రచారాలు చేయాలని, సభలు, సమావేశాలు ఏర్పాటుచేసి ప్రజలకు సూచిస్తోంది. ఇలా ప్రధానపార్టీల వ్యూహాలతో జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

ఓపెన్ స్కూల్ పరీక్షలను

పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 15: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఈనెల 25 నుంచి మే2 వరకు నిర్వహించే పదో తరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సజావుగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షిస్తు ఇటీవల నిర్వహించిన పదోతరగతి, ఇంటర్ పరీక్షల మాదిరే అందరూ అధికారులు పక్బందీగా సమన్వయంతో పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్‌లలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో పదోతరగతికి 923 మంది, ఇంటర్‌మీడియట్‌కు 1444మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పదోతరగతి పరీక్షలకు 5 పరీక్షకేంద్రాలను ఏర్పాటు చేశామని అందులో రెండుకేంద్రాలు బాన్సువాడ, ఒకకేంద్రం ఎల్లారెడ్డి, మరో రెండు కేంద్రాలు కామారెడ్డిలో ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అదేవిధ ంగా ఇంటర్మీడియట్ పరీక్షలకు 6పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని అందులో బాన్సువాడలో ఒకటి, ఎల్లారెడ్డిలో రెండు కాగా మిగితా నాలుగు కేంద్రాలను కామారెడ్డిలో ఏర్పాటుచేశామని తెలిపారు. సమావేశంలో డీఈవో రాజు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ లింగం, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, డిపో మేనేజర్ ఇందిరా, తపాల,పోలీసు, రెవెన్యూ,ఎలక్ట్రిసిటీ, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

అగ్నిప్రమాదాల పట్ల జాగ్రత్తలు పాటించాలి

అగ్నిమాపక శాఖ అధికారి వినోద్‌కుమార్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బిచ్కుంద, ఏప్రిల్ 15: అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అగ్నిమాపక ఇన్‌చార్జ్ అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్నిమాపక అధికారులు అగ్ని ప్రమాదం సంభవిస్తే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన విధివిధానాలు ప్రయోగకరంగా చూపిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ఎక్కువగా అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నందున చిన్నచిన్న అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండి సత్వరమే చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నర్సింలు, వెంకటేశం, రాజేందర్, సహదేవ్, దిగంబర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

అవినీతి రహితపాలనే లక్ష్యం

- పలువురు కౌన్సిలర్లు ప్రజల నుంచి వసూళ్లు బంద్‌చేసుకోవాలి
- తాగునీరు, అభివృద్ధిపై దృష్టిసారించాలి
- రాబోయే ఎనిమిది నెలల్లో కామారెడ్డిని బెస్ట్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ

కామారెడ్డిటౌన్, ఏప్రిల్15: కామారెడ్డి మున్సిపల్‌లో ప్రజలకు అవినీతి రహిత పాలనను అందించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. సోమవారం కామారెడ్డి మున్సిపల్‌చైర్‌పర్సన్‌గా గడ్డం ఇందుప్రియ ఎన్నిక కావడంతో ఆమెను అభినందించిన అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతోమున్సిపల్ చైర్‌పర్సన్‌గా గడ్డం ఇందుప్రియ ఎన్నికయ్యారని, వైస్‌చైర్‌పర్సన్‌గా ఉరుదొండ వనిత ఎంపిక అవుతారని తెలిపారు. కామారెడ్డి మున్సిపల్‌లో నాలుగేళ్ల 3నెలల అవినీతి పాలనకు చరమగీతం పాడామని అన్నారు. రాబోయే ఎనిమిది నెలల్లో బెస్ట్ మున్సిపాలిటీగా కామారెడ్డిని తీర్చిదిద్దుతామని వెల్లడించారు. మున్సిపాలిటీలో ప్రజలకు సరిపడా నీళ్లు రావడం లేదని 10 ఎంఎల్‌డీ నీటిసరాఫరాకు కేవలం 4 ఎంఎల్‌డీ నీరు మాత్రమే సరాఫరా అవుతుందని తెలిపారు. ఎన్నికల తర్వాత సీఎం సమక్షంలో మిషన్‌భగీరథ అధికారులతో సమావేశం నిర్వహించి తాగునీటి సమస్యకు శాశ్వతపరిష్కారం చూపిస్తామన్నారు. మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో పలువురు కౌన్సిలర్‌లు బిల్డింగ్ నిర్మాణాలు జరిగే సమయంలో వసూళ్లకు పాల్పడడం మానుకోవాలని, రెవెన్యూకు సంబంధించి అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని సూచించారు. పట్టణంలో తాను చదువుకున్న ప్రభుత్వ బాలుర పాఠశాల కూలిపోయే స్థితిలో ఉందని, 2నుంచి 3కోట్ల వ్యయంతో నూతన పాఠశాల నిర్మాణం చేపడుతామని చెప్పారు. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం ఏర్పటయ్యాక ఇప్పటికే 5 గ్యారెంటీలను పూర్తిచేశామని, 90 రోజుల్లో 31వేల ఉద్యోగాలిచ్చి చరిత్రలో నిలిచామని తెలిపారు. ఎన్నికల కోడ్ తర్వాత మరో 50వేల ఉద్యోగాలు భర్తీచేస్తామని తెలిపారు. 10వేల కోట్ల మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని 8లక్షల కోట్ల అప్పుతో కేసీఆర్ ఉంచారని తెలిపారు. పైగా బీఆర్ఎస్ నాయకులు సిగ్గు లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆకాశంపై ఉమ్మితే మనపైనే పడుతుందని మర్చిపోతున్నారని అన్నారు. పదేళ్లలో బీబీపాటిల్ కేంద్రం నుంచి, రాష్ట్రం నుంచి పైసా పనిచేయాలేదని అన్నారు. ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను గెలిపిస్తే ప్రజలకు మంచి చేస్తాడని తెలిపారు. పీసీసీ హోదాలో ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలు నిజమని తేలియాలని, త్వరలో కేసీఆర్ కుటుంబం జైలుకు వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

- మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన గడ్డం ఇందుప్రియ
- చైర్‌పర్సన్ రేసులో గడ్డం ఇందుప్రియ,ఉరుదొండ వనితలు
- గడ్డం ఇందుప్రియ వైపే అధిష్ఠానం మొగ్గు
- కాంగ్రెస్ పార్టీ నుంచి 28 మంది కౌన్సిలర్ల హాజరు
- చైర్‌పర్సన్ ఎన్నికకు బీఆర్ఎస్,బీజేపీ కౌన్సిలర్‌లు దూరం

రెండు నెలల

ఉత్కంఠకు తెర



కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం



చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న గడ్డం ఇందుప్రియ



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆర్డీవో

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 15: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠంపై గత రెండునెలలుగా కొనసాగుతున్న ఉత్కంఠకు సోమవారం జరిగిన ఎన్నికతో తెరపడింది. ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం దక్కించుకుంది. మున్సిపల్‌లో మొత్తం 49మంది కౌన్సిలర్‌లు ఉండగా కాంగ్రెస్ పార్టీకి 28 మంది, బీఆర్ఎస్‌కు 15 మంది, బీజేపీకి ఆరుగురు కౌన్సిలర్లు, ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో ఓటు 1 ఉంది. కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ ఎన్నికకు హాజరవగా బీజేపీ, బీఆర్ఎస్‌లు గైర్హాజరయ్యాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి గడ్డం ఇందుప్రియను 48వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ అన్వర్ అహ్మద్, 38వ వార్డు కౌన్సిలర్ చాట్ల రాజేశ్వర్‌లు ప్రతిపాదించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకే ఒక నామినేషన్ దాఖలు కాగా 28మంది కౌన్సిలర్‌లు ఇందుప్రియకు మద్దతు పలుకడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్డీవో రఘునాథ్‌రావు ప్రకటించారు. అనంతరం ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించి ఎన్నికైన నియామక పత్రాన్ని అందించారు.

బీఆర్ఎస్ నుంచి.. కాంగ్రెస్ ఖాతాల్లోకి చైర్‌పర్సన్ పదవి

గత నాలుగు సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన నిట్టు జాహ్నవి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉండగా, ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో బీఆర్ఎస్ మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై అవిశ్వాసం పెట్టి ఆమెను పదవి నుంచి దించేశారు. వాస్తవానికి గత అసెంబ్లీ ఎన్నికల కంటే ముందువరకు కాంగ్రెస్‌లో కేవలం నలుగురు మాత్రమే కౌన్సిలర్‌లు ఉన్నారు. ఆ తర్వాత ఎన్నికల సమయానికి బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్‌కు గురైన వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ కాంగ్రెస్ పార్టీలో చేరింది. ఆమెతోపాటు మరో నలుగురు కౌన్సిలర్‌లు కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల్లో గెలుపొంది కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో ఒకరొకరుగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరగా వారి సంఖ్య బలం 28కి చేరింది. దీంతో బీఆర్ఎస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసాన్ని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌లు పెట్టారు. అవిశ్వాసం పెట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్‌ను పదవి నుంచి దించేందుకు 34మంది సభ్యుల సంఖ్యా బలం కావాల్సి ఉండగా బీఆర్ఎస్ పార్టీలోని 10మంది కౌన్సిలర్‌లు కాంగ్రెస్‌కు మద్దతు పలికి సొంత పార్టీకి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్‌ను పదవి నుంచి దించేలా కాంగ్రెస్ నాయకులు పావులు కదిపారు. దీంతో బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న చైర్‌పర్సన్ పీఠం కాంగ్రెస్ ఖాతాల్లోకి వచ్చి చేరింది.

గడ్డం ఇందుప్రియ వైపే అధిష్ఠానం మొగ్గు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒకరొకరుగా బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో కౌన్సిలర్‌లు చేరేందుకు వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి, ఉరుదొండ వనిత రవిలు ఎంతో కృషిచేశారు. కాంగ్రెస్‌పార్టీ నుంచి గత మున్సిపల్ ఎన్నికల సమయంలో 12మంది కౌన్సిలర్‌లు గెలుపొందగా ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలోకి 8మంది కౌన్సిలర్‌లు వెళ్లారు. ఇటీవల ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌కు వెళ్లిన కౌన్సిలర్‌లతో పాటు బీఆర్ఎస్, ఇండిపెండెంట్‌లుగా గెలిచిన పలువురు కౌన్సిలర్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో వారిసంఖ్య 28కి చేరింది. అయితే కౌన్సిలర్‌లను పార్టీలో చేర్పించేందుకు ఇద్దరు కష్టపడడంతోపాటు చైర్‌పర్సన్ రేసులోనూ ఉన్నారు. దీంతో సోమవారం ఎన్నిక జరిగేవరకు ఎవరు చైర్‌పర్సన్ అవుతారనే దానిపై ఉత్కంఠ నెలకొనగా కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డికే చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించింది. దీంతో ఉరుదొండ వనితరవితో పాటు ఆయన వర్గానికి చెందిన పలువురు కౌన్సిలర్‌లు ఒకింత కలత చెందినట్లు తెలుస్తోంది. అయితే ప్రభుత్వ సలహా దారుడు షబ్బీర్‌అలీ ఎన్నిక అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వైస్‌చైర్‌పర్సన్‌గా ఉరుదోండ వనిత రవిలకు అవకాశం కల్పించేందుకు అధిష్ఠానం అంగీకరించిందని తెలిపారు. వైస్‌చైర్‌పర్సన్ ఎన్నికకు ఎన్నికల కమిషన్ మరో తేదీని ప్రకటిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ సుజాత తెలిపారు. అయితే చైర్‌పర్సన్ పదవిపై ఆశలు పెట్టుకున్న ఉరుదొండ వనితరవిలు వైస్‌చైర్‌పర్సన్ పదవిని స్వీకరిస్తారా లేదా అనేది వేచిచూడాలి.



ఇందుప్రియను బలపరుస్తూ చేతులెత్తిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

బీఆర్ఎస్, బీజేపీ చైర్‌పర్సన్ ఎన్నికకు దూరం

మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం దక్కించుకునేందుకు బీఆర్ఎస్, బీజేపీలు ప్రయత్నాలు చేసినప్పటికీ నామినేషన్ దాఖలు సమయానికి హాజరుకాలేదు. రెండుపార్టీలకు సంఖ్యాబలం తక్కువగా ఉండడంతో ఎన్నికకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే బీఆర్ఎస్, బీజేపీ కలిసి చైర్‌పర్సన్ పీఠందక్కించుకునేందుకు ప్రయత్నాలు చేసినా ఏకాభిప్రాయం కుదరలేదని సమాచారం. బీఆర్ఎస్ కౌన్సిలర్‌లలో పలువురు మున్సిపల్ ప్రాంగణంలోకి వచ్చినా అధిష్ఠానం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో మున్సిపల్ సమావేశానికి హాజరుకాలేదు.

అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్15: మున్సిపల్ పరిధి లోని అంబేద్కర్‌చౌరస్తా, కొత్తబస్టాండ్, పెర్కిట్ బస్టాండ్‌లలో సోమవారం ఫైర్ సిబ్బంది అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగా హన కల్పిం చారు. అగ్నిమాపక వారోత్స వాల్లో భాగంగా ప్రధాన కూడళ్లపై అగ్నిమాపక సిబ్బంది ఫైరిం జన్‌తో విన్యాసాలు చేశారు. అలాగే అగ్నిప్ర మాదం సంభవించకుండా తీసుకోవాల్సిన జా గ్రత్తలను ప్రజలకు సూచిం చారు. ఈ కార్య క్రమంలో ఎస్ఎఫ్‌వో మధుసూదన్‌రెడ్డి, ఎల్ఎఫ్‌లు ప్రకాష్, అనంత్‌రావు, ఎఫ్ఎం వంశీ, రాజ్‌కుమార్, విజయేం దర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన అధికారులు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్15: మండలంలోని జక్రాన్‌పల్లి, ఇంద్ర నగర్, అర్గుల్ పాఠశాలలను సోమవారం అధికారులు సంద ర్శించి పరిశీలించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను ఎంపీడీవో అడిగితెలుసుకున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్15: మండలంలోని ఫత్తేపూర్ గ్రామ శివారులో టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య ఆధ్వర్యంలో సోమ వారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. తెలి సిన సమాచారం మేరకు ఫత్తేపూర్ గ్రామశివారులో దాడి చేయగా వారి వద్ద నుంచి రూ.7410 స్వాధీనం చేసుకొని పేకాట రాయుళ్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వారిపై కేసు నమోదు చేసినట్టు తెలిసింది.

ఎలుగుబంటి దాడిలో గాయపడిన బాలగౌడ్



గాయపడిన బాలగౌడ్

సిరికొండ ఏప్రిల్ 15 : కొండాపూర్ గ్రామానికి చెందిన మొగుళ్ల బాలాగౌడ్(55)ను సోమవారం తెల్లవారు జామున అడవీలో ఎలుగుబంట్లు దాడిచేసిన ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అప్పడప్పుడు అడవీ వెళ్లికి కట్టెలు తెచ్చి అమ్ముకుంటాడు.అతనికి ఎవరు లేనందున ఇలా జీవిస్తున్నాడు ఆయన నిత్యం చేసే విధంగా సోమవారం తెల్లవారు జామున అడవి మార్గంలో నడుచుకుంటూ కొండాపూర్‌కు వెళ్తుండగా మార్గ మధ్యలో ఎలుగుబంట్లు దాడి చేసి గాయపరిచాయి. ఉదయం వేళలో గ్రామానికి వచ్చిన బాలగౌడ్ జరిగిన సంఘటన చెప్పగా బంధువులు, గ్రామస్థులు 108 అంబులెన్స్‌కు కాల్ చేయగా చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలగౌడ్ ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు.

ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిక



బీజేపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

మాక్లూర్, ఏప్రిల్15: మండలంలోని గొట్టుముక్కల గ్రామానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి సుమారు 50మంది నాయకులు, కార్యకర్తలు సోమవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సమక్షంలో బీజేపీ పార్టీలో చేరగా వారికి బీజేపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి పనులకు బీజేపీ పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, ఎంపీటీసీ రాజు, గంగారెడ్డి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పట్ల హర్షం వ్యక్తం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్15: ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూ మన్న హర్షం వ్యక్తం చేశా రు. సోమవారం జర్నలిస్టు కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెం ట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్య ర్థికే మాదిగలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారం లోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకర ణ చేస్తామని పదేళ్లు అయిన చేయ లేదని, వర్గీకరణ చేస్తామని చెప్పిన ప్రధాని మోదీ తీర కమిటీ పేరున కాలయాపన చేస్తున్నారని, మాదిగ లపై చిత్తశుద్ధి లేదని అన్నారు. బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాల్లో దళి తు లపై దాడులు, అత్యాచారాలు, హ త్యలు జరుగుతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌టి. కుమార్, గంగోని స్వామి, మే తరి సాయన్న, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధులగుట్టపై ప్రత్యేక పూజలు


సిద్దులగుట్ట శివాలయంలో పూజలందుకున్న సిద్ధేశ్వరుడు

పెర్కిట్, ఏప్రిల్15: ఆర్మూర్ పట్టణంలోని నవనథ సిద్ధుల గుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యం లో సోమవారం సిద్ధేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. సిద్ధులగుట్టకు విచ్చేసిన భక్తులు రామాలయం, దుర్గామాత, దత్తాత్రే య, అయ్యప్ప, ఎల్లమ్మ తల్లి, ఏకశిల స్తంభం వద్ద గల హన్మాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకీ సేవలో ఆర్మూర్ భజన మండలి సభ్యులు పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ అలరించారు. సిద్ధులగుట్ట ఉత్సవ కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని భక్తులు అధిక సంఖ్యలో స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సిద్ధులగుట్ట ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ. గంగారెడ్డి, కోడిగెల మల్లయ్య, అజారి సతీష్, బోండ్ల ఆనంద్, ప్రశాంత్‌గౌడ్, కొంతం మురళీ, ఆలిశెట్టి నరేష్, పొద్దుటూరి చరణ్‌రెడ్డి, బట్టు శంకర్, సిద్ధులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఇదీ.. ఆర్టీసీ బస్టాండేనా..?!

● దుర్గంధభరితంగా మారిన ఆర్మూర్ బస్టాండ్ ● ఇబ్బందుల్లో ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు


ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద మెయిన్‌రోడ్డుపై డ్రైనేజీ లీకేజీ


ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో గుంతలో నిలిచిన వర్షపు నీరు


బస్టాండ్‌లోకి వస్తున్న మురికినీరు

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్ 15: ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌కు సమస్యలు చుట్టు ముడుతున్నాయి. ఇదీ ఆర్టీసీ బస్టాండేనా? అనే విధంగా అనిపిస్తుందని ప్రయాణికులు అంటున్నారు. వివరాలోకి వెళ్తే మెయిన్‌రోడ్డుపై వెళ్ళాల్సిన డ్రైనేజీకి లీకేజీలు ఏర్పడి బస్టాండ్‌లోకి రావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిజాంసాగర్‌కెనాల్ బ్రిడ్జి సమీపం నుంచి బస్టాండ్ ఇన్ గేట్ వరకు డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తి అయ్యి పనులు ప్రారంభించి నిలిపివేశారు. డ్రైనేజీ నీరు బయటకు రావడంతో దుర్గంధం వ్యాపించడంతో పాటు బస్సులు వెళ్లే సమయంలో ప్రయాణికులపై మురికినీరు పడుతున్నాయి. బస్టాండ్ మధ్య ద్వారం వద్ద సైతం డ్రైనేజీ పైపు సరిగ్గా లేకపోవడంతో వచ్చిపోయే ప్రయాణికులకు అసౌకర్యంగా మారింది. ఆ స్థలంలోనే ఎన్నో ఏళ్ళ నుంచి చీరు వ్యాపా రులు, మహిళలు పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి పక్క నుంచి వెళ్లే మురికినీటితో ఇబ్బందులు ఎదుర వ్వడమే గాకుం డా దుర్గంధంలోనే వారు వ్యాపారాలు చేసుకోవాల్సిన పరి స్థితి ఏర్పడింది. బస్టాండ్ లోపల సైతం చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి ప్రయాణికులకు అసౌకర్యం ఏర్పడుతోంది.

● అపరిశుభ్రతకు నిలయం..

ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్ అపరిశుభ్రతకు నిలయంగా మారింది. బస్టాండ్ ఆవరణలో ప్రజలు, వ్యాపారులు ఇష్టరీతిన చెత్తను వేయడంతో అపరిశుభ్రంగా తయారైంది. ఆర్టీసీకి స్థలం ఎక్కువ ఉన్నప్పటికీ ఆ స్థలాన్ని చదును చేయడంలేదు. దీంతో వర్షాలు కురిసే సమయంలో వర్షపు నీరు నిలిచి దుర్గంధం వచ్చే ప్రమాదం ఉంది. ప్రయాణికులకు అసౌకర్యంగా మారుతుంది. పిల్లలు, పెద్దలు పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు.

● ప్రైవేటు వాహనాల పార్కింగ్

ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రైవేటు వాహనాల పార్కింగ్ ఇష్టారాజ్యంగా కొనసాగుతుంది. ప్రయాణికులను దింపడానికి వచ్చే వాహనాలతో పాటు బస్టాండ్ ప్రవేశ ద్వారం వద్ద ప్రైవేటు వాహనాలను ఇష్టరీతిగా పార్కు చేయడంతో లోపలికి వచ్చే బస్సులకు ఇబ్బందిగా మారింది. ప్రైవేటు వాహనాల పార్కింగ్‌తో ఆర్టీసీ డ్రైవర్‌లు అవస్థలు పడాల్సి వస్తోంది. వీటికి తోడు బస్టాండ్‌లోకి వచ్చే ఆటోల బెడద ఎక్కువగానే ఉంటుంది. ఆటోలు సైతం బస్టాండ్ ఇన్ గేట్ వద్ద నిలిపి ఉంచడంతో సమస్యలు ఎక్కువవుతున్నాయి. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బంది లను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ అధికారులు వెంటనే డ్రైనేజీ నిర్మాణం చేపట్టి బస్టాండ్‌లోకి మురికినీరు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో గుంతలో నిలిచిన వర్షపు నీరు

మూడు నెలలుగా అస్తవ్యస్తంగా డ్రైనేజీ



ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో డ్రైనేజీ వ్యవస్థ చెడిపోయి చాలా రోజులు అయ్యింది, బస్టాండ్‌లోకి వెళ్లే ప్రయాణికులకు డ్రైనేజీ నీరుతో ఇబ్బందిగా మారింది. బస్టాండ్‌లో చెత్త, డ్రైనేజీ నీరు లేకుండా చూడాలి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ నిర్మించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి.

- లింగన్న, ప్రయాణికుడు, ఆర్మూర్

డ్రైనేజీ పనులను త్వరలోనే పూర్తి చేస్తాం



ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో డ్రైనేజీ పనులు త్వరలోనే పూర్తి చేస్తాం, డ్రైనేజీ పనుల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది పనులు ప్రారంభించినప్పటికీ సాంకేతిక సమస్య కారణంగా పనులు నిలిచిపోయాయి. త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రయా ణికుల ఇబ్బందులు తొలగిస్తాం.

- రాజు, మున్సిపల్ కమిషనర్

లయన్ నివేదన్‌కు అవార్డు ప్రదానం

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్15: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ నివేదన్‌కు లయన్స్‌క్లబ్ గవర్నర్ లక్ష్మీ ప్రశంసాపత్రంతో పాటు అవార్డును అందజేశారు. ఇటీవల నివేదన్ ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్‌కు రూ.86వేల విరాళం అందించినందుకు గాను హైదరాబాద్‌లోని కేవీ ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆయనను అభినందిం చారు. ప్రతీ లయన్స్ సభ్యు డు విరాళాలు అందజేసి ప్రపంచ వ్యాప్తంగా నిరుపేద ప్రజల అవస రాల కు స్వచ్ఛందంగా ఉపయోగపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ల యన్స్ క్లబ్ గ్రీన్ అధ్యక్షుడు జెంటిల్‌కిడ్స్ ప్రకాష్, కార్యదర్శి రాజేష్, చేపూర్ గణేష్, ఆకుల రాజుస్వామి, శ్రీనివాస్, దోండికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవొద్దు

మెండోర, ఏప్రిల్15: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని రైతులు పండించిన వరిధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ప్రత్యేక అధికారి అబ్దుల్‌బారి అన్నారు. సోమవారం మండలంలో సావెల్ సొసైటీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి, ఏఈఓ రాజేశ్వర్, సీఈవో అరుణ్, సొసైటీ డైరెక్టర్‌లు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగ్యారెంటీలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్ పార్టీ

● నిజాబామాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్


భీమ్‌గల్‌లో సమావేశంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్15: నేను పక్కాలోకల్ అని, నాకు బుల్లెట్ దిగిన.. ఆ బుల్లెట్ కే భయపడని వ్యక్తినని.. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని సేవకుడిగా పనిచేస్తానని, ఆరు గ్యారెంటీలతో ప్రజలను వచించిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు అతి తొందరలోనే కర్రు కాల్చివాత పెట్టే రోజులు వున్నాయని బీఆర్ఎస్ ఎంపీ నిజామాబాద్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. సోమవారం భీమ్‌గల్ పట్టణంలోని మెరిడియన్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు సురేష్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ నేటికి 120 రోజుల గడుస్తున్నా ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదని, ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని సూచించారు. పేదలకు కల్యాణ లక్ష్మీ కింద లక్షతో పాటు, తులం బంగారం ఇప్పటివరకు ఎందరికి ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, మహిళలకు పెన్షన్, రైతులకు రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వహయాంలో కరెంటుకోతలు మొదలయ్యాయని,కాంగ్రెస్ పార్టీ ఎన్నిరోజులుపరిపాలిస్తుందో ఆపార్టీ నాయకులకే తెలియదన్నారు. అబద్దపు హామీలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గెలిచారని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24కరెంటు ఇచ్చినామని, బాల్కొండ నుంచి అత్యధిక మెజార్టీ ఓట్లు రావాలని ఆకాంక్షిం చారు.

● రాష్ట్రంలో కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గింది

పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రూపంలో ఉండదని ఇంకోరూపంలో నూతన ప్రభుత్వం ఏర్పడుతుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ తగ్గిందని, లోకల్ బాడీ ఎలక్షన్‌లో నామరూపాలు లేకుండా పోతుందని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.పార్లమెంట్ ఎన్నికల తర్వాత మహిళలకు ఉచిత బస్సు బంద్ కాబోతుందని, నష్టాలను భరించడం మావల్ల కాదు అని ఆర్టీసి చేతులు ఏత్తేస్తోందని అన్నారు. కేసీఆర్ పాలనపై అనేక రాష్ట్రాలు ఇప్పటికి ప్రజలు, నాయకులు ప్రశంసిస్తున్నారని మచ్చలేని నాయకుడు బాజిరెడ్డి గోవర్ధన్ అని రాజ్యసభ సభ్యుడు ఎంపి కేఆర్‌సురేష్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆర్మూర్ మహేష్, జడ్పీటీసీ రవి, మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజామాబాద్ అర్బన్: నగరంలోని శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో సోమవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలో బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎంపీగా ఎన్నికైతే పద్మశాలీల కోసం పనులు చేసి పెడతానని ఆయన వారికి హామీలను ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని అన్నారు. ఈ ఎన్నికల్లో తప్పనిసరిగా తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుజ్జేటి వెంకటనర్సయ్య, సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం ఉంది

● నిజామాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి


సిరికొండలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

ధర్పల్లి, ఏప్రిల్ 15: నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోగల పార్టీ కార్యాలయంలో ఆయన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంతోనే ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల పూర్తి విశ్వాసం ఉందని ఆయన పేర్కొన్నారు. ఆరు గ్యారంటీ హామీలను ఇప్పటికే అమలు చేశామన్నారు. ఈ హామీలు ఇతర కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రంలో సైతం అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రభుత్వంపై సానుకూలంగా ఉన్నారని నిజామాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ఖచ్చితంగా కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీని కరీఫ్‌లోగా రైతులకు అందజేస్తామన్నారు. రైతుల రుణాలు బ్యాంకర్ల ద్వారా ప్రభుత్వానికి బదలాయింపు చేసి కొత్తగా రుణాలు పొందేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 92 శాతం రైతుబంధు పథకాన్ని రైతులకు వర్తింపజేశామన్నారు. ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులందరికి ఈ పథకాన్ని వర్తింపజేశామని ఆయన గుర్తు చేశారు. సాగు చేయని భూములకు రైతుబంధు వర్తించదని ఆయన పేర్కొన్నారు. ప్రాణహిత చేవెళ్ల 21 ప్యాకేజీని పూర్తి చేసి నిజామాబాద్ రూరల్ రైతులకు సాగునీరు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, వీడీసీ ఛైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: ఈసారి జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల్లో దేశంలో అత్యధికంగా సీట్లు గెలుపొంది అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ఆధ్వర్యంలో గల అలయెన్స్ ప్రభుత్వమే అని నిజామాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సిరికొండ మండల కేంద్రంలో సోమవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడారు. దేశంలో నిత్యవసర ధరలు పెరిగి ద్రవ్యోల్బణం పెరిగి పోయిందన్నారు. నిరుద్యోగం తాండవిస్తోన్న నరేంద్రమోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.ధరల పెరుగుదల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఇవేమి తమకు పట్టవన్నట్లు మోసపు మాటలు చెప్పి మరో సారి అధికారంలోకి రావాలని కలలు గంటుందన్నారు. నిధులు తేక పోగా ధర్నా చేయడమేమిటని జీవన్‌రెడ్డి నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో తాము ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదు అమలు చేస్తున్నామన్నమని ఆయన వివరించారు. దేశానికి కాబోయే ప్రధాని రాహులాల్‌గాంధీ అని జీవన్‌రెడ్డి వెల్లడించారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ గెలిచి ఏమి పనులు చేపట్టకుండా ఐదేళ్లు కాలక్షేపం చేశాడని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి,మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీమండలఅధ్యక్షుడు రవి, గడీల రాములు, తదితరులుఉన్నారు

● కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ మైనారిటీ మండల అధ్యక్షుడు గౌస్‌భాషా, సిరికొండ పీఏసీఏస్ మాజీ అధ్యక్షులు లింగారెడ్డి,మాజీ సర్పంచ్‌లు,మైనారిటీ నాయకులు, యువకులు, గిరిజన నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలోకి వచ్చిన వారందరికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మోపాల్: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే దేశంలోనే నిజామాబాద్ పార్లమెంట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మోపాల్ మండలం కార్యకర్తల సమావేశాన్ని బోర్గాం(పి) గ్రామ సమీపంలో ఉన్న భూంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో పార్లమెంట్ నియోజకవర్గం నుండి గెలిచిన కవిత, అర్వింద్‌లు ఈ ప్రాంతం పట్ల నిర్లక్ష్యం చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, నాయకులు గడుగు గంగాధర్, ముప్ప గంగారెడ్డి, నగేష్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, రత్నాకర్, మీసాల సుధాకర్, పార్టీ మండల అధ్యక్షులు సాయిరెడ్డి, ఆయా గ్రామాల సొసైటీ ఛైర్మన్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీలో చేరిన భూంరెడ్డి, బాగారెడ్డి

మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సమక్షంలో మాజీ ఎంపీపీ భూంరెడ్డి, బీజేపీ నాయకులు బాగారెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వీరికి సుదర్శన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. వీరితో పాటు ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, బీఆర్ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

డిచ్‌పల్లి: తాను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన వెంటనే మహిళా డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చొరవ చూపుతానని కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో రిటైర్డ్ ప్రొఫెసర్ గోపాలం విద్యాసాగర్‌రావు నివాసంలో అల్పాహారం విందుకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగుతున్న అర్వింద్ ఐదు సంవత్సరాలు గడిచిన పసుపు బోర్డు ఏర్పాటు చేయలేదని ఆయన ఎద్దేవ చేశారు. రుణమాఫీ, పసుపు బోర్డు, చక్కెర కర్మాగారం ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు గోపాలం విద్యాసాగర్‌రావు, అమృతాపూర్ గంగాధర్, వాసుబాబు, ధర్మాగౌడ్, శ్యామ్‌సన్, తారాచంద్‌నాయక్, తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న కంటి వైద్యుడు

విద్యార్థులకు కంటి పరీక్షలు

లింగంపేట, ఏప్రిల్15: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల, లింగంపల్లిలోని మైనారిటీ గురుకుల పాఠశాలల్లో సోమవారం కంటి వైద్యుడు హరికిషన్ కంటి పరీక్షలు నిర్వహించారు. కస్తూర్బాలో మొత్తం 203 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా 27మందికి విటమిన్ ఏ సమస్యలు ఉన్నాట్లు గుర్తించామని తెలిపారు. మైనారిటీ గురుకుల పాఠశాలలో మొత్తం 126 మందికి పరీక్షలు నిర్వహించగా 6గురికి కంటి అద్దాలు పంపిణీ చేశామని, ఇద్దరు మెల్లకన్ను, ముగ్గురు విటమిన్ ఏ లోపం ఉన్నట్లు గుర్తించామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు, నిఖిత, క్రాంతి, ఫార్మాసిస్ట్ ప్రదీప్, ఏఎన్ఎమ్ రాజమణి, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్ రాములులతో పాటు విద్యార్థులు ఉన్నారు.

పాఠశాల ఉపాధ్యాయుడి సస్పెండ్

కామారెడ్డిటౌన్, ఏప్రిల్15: మండలంలోని శెట్పల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు శ్రీనివాసశర్మను సస్పెండ్ చేసినట్లు డీఈవో రాజు తెలిపారు. పాఠశాలలోని విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వల్ల ఈ చర్యలు తీసుకున్నట్లు డీఈవో ఒక ప్రకటనలో వివరించారు.

మహిళా సంఘానికి రుణం మంజూరు చేయాలి

సదాశివనగర్, ఏప్రిల్15: మండలంలోని మెడేగామ గ్రామంలోని సిరి మహిళా సంఘానికి రుణం అందించాలని సంఘసభ్యులు ప్రాధేయపడుతున్నారు. పాత రుణాన్ని చెల్లించిన తర్వాత కొత్త రుణం అందించడానికి ఐకేపీ సిబ్బంది నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు. ఎన్నిసార్లు రుణం కోసం మొరపెట్టుకున్న బెదిరిస్తున్నారని ఐకేపీ ఏపీఎం కల్పించుకుని తక్షణమే రుణమందించాలని లేనిపక్షంలో ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

రాజగోపుర ప్రతిష్ఠాపనకు హాజరుకావాలి

దోమకొండ, ఏప్రిల్15: మండల కేంద్రంలోని శ్రీ చాముండేశ్వరి దేవాలయ రాజగోపుర శిఖర ప్రతిష్ఠాపన, సంకల్ప గణపతి 8వ వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని సోమవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్అలీకి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. 22 నుంచి 28 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నమని, కార్యక్రమాల్లో పాల్గొనాలని షబ్బీర్అలీని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ పాలకుర్తి శేఖర్, తాటిపల్లి శ్రీకాంత్, చిట్యాల రాజిరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

దోమకొండలో ర్యాలీ

దోమకొండ, ఏప్రిల్15: మండల కేంద్రంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం అంబేద్కర్ ర్యాలీని మెయిన్ రోడ్డు, అంగడి బజార్, శివరాంమదిర్ రోడ్డు, పలుగడ్డతో పాటు ప్రధాన వీధులగుండా తీశారు. భారీ విద్యుత్ దీపాలు, డీజే చప్పుళ్ల, గుర్రాలతో నృత్యాలు చేస్తూ ర్యాలీని కొనసాగించారు. కార్యక్రమంలో అబ్రబోయిన స్వామి, అంబేద్కర్ సంఘ సభ్యులు రాము, మురళి, బోలేశ్వర్, లింగం, రవి, పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు: ఎమ్మెల్యే

మద్నూర్, ఏప్రిల్15: మండలంలోని పెద్దఎక్లారా గ్రామంలో సోమవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కొత్తగా చేరినవారు ఆందోళన పడాల్సిన అవసరంలేదని, ప్రతిఒక్కరికీ ప్రాధాన్యత ఉంటుందన్నారు. జుక్కల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల తర్వాత అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు పార్టీలకు అతీతంగా మొదటి విడతలో ఇవ్వనున్నట్లు వెల్లడించారు. విడతల వారీగా అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అనంతరం జుక్కల్ మాజీ ఎమ్మెల్యే నాగ్‌నాథ్ సేట్ తమ్మేవార్ సతీమణితో పాటు మాజీ ఎఎంసీ చైర్మన్ మృతి పట్ల సభలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సాయిలు, సంగమేశ్వర్, నాయకులు తదితరులున్నారు.

'ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్‌కే ఉంది'

బిచ్కుంద, ఏప్రిల్ 15: రాష్ట్రంలో పదేళ్ల ప్రజలకు మెరుగైన పాలన అందించిన బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందని మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మున్నూరుకాపు సంఘంలో మండల స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ 420 అమలుకు సాధ్యం కాని హమీలుఇచ్చి అధికారంలోకి వచ్చిన మూడునెలల ప్రభుత్వ పాలనలోనే రాష్ట్ర ప్రజలు చీదరించుకునే స్థాయికి దిగజారిపోయారన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో ప్రజల తీర్పు బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వైపు ఉంటారని అందుకు అనుగుణంగా గ్రామాల వారిగా పార్టీ కార్యకర్తలు దృష్టిపెట్టి పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్, ఎంపీపీ అశోక్‌పటేల్, పార్టీ అధ్యక్షుడు వెంకట్రావ్‌దేశాయ్, మాజీ జడ్పీచైర్మెన్ ధపేదర్‌రాజు,జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

వంద రోజుల్లో హామీల అమలు ఏమాయే?

- రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్ఎస్‌తోనే తెలంగాణ ప్రజలకు సంక్షేమ ఫలాలు
- ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి: మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ, ఏప్రిల్ 15: అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను పూర్తిగా మోసం చేసిందని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం పట్టణంలోని మీనా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బాన్సువాడ మున్సిపాలిటీ, మండల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమవేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టో చూసి ఆశపడి ప్రజలు ఓట్లు వేశారని, కానీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. రైతుబంధు ఎకరాకు రూ.15వేలు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు, వరి పంట క్వింటాకు 500 బోనస్, 18ఏళ్ల దాటిన మహిళలకు నెలకు రూ.2500, ఇంకా చాలా హామీలిచ్చి తీరా అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. బాన్సువాడ నియోజకవర్గంలో 11వేల డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరైతే అందులో 10వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత పెండింగ్‌లో ఉన్న 26కోట్ల బిల్లులు ఇవ్వాలని కాంగ్రెస్ మంత్రిని కోరితే బాన్సువాడలో తనపై పోటీ చేసి ఓడిపోయిన కాంగ్రెస్ నాయకుడు అదే కాంగ్రెస్ మంత్రితో బిల్లులు ఇవ్వొద్దని చెప్పాడన్నారు. నాయకులు ప్రజల సంక్షేమం కోసం పని చేయాలే కానీ ప్రజలను మోసగించేలా ఉండరాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అంటున్నారు ప్రజలు మోసపోవద్దన్నారు. 2004 నుంచి 2009 మధ్య బాన్సువాడ నియోజకవర్గంలో 24 వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని చెప్పి కాంగ్రెస్ నాయకులు దొంగ బిల్లులు లేపారన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి చూసి ప్రజలు ఓట్లు వేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రోటోకాల్‌లో లేని వ్యక్తులు ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారికంగా పాల్గొంటూ అల్లరి, చిల్లర పనులు చేస్తున్నారని, మర్యాదగా ఉంటూ మంచి పనులు చేయాలని, లేదంటే ఊరుకోబోమని హెచ్చరించారు. జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మంచి వ్యక్తని, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని, మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి, మాజీ డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి తదితరులున్నారు.

పార్టీమారిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారు: ఎమ్మెల్యే

గాంధారి: బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని, పార్టీ మారిన వారికి ప్రజలే బుద్ధిచెబుతారని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అధ్యక్షతన జహీరాబాద్ బీఆర్ఎస్ పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని సూచించారు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్ ఎవరు పార్టీలు మారినా భయపడరని అన్నారు. కేసీఆర్ నిలబెట్టిన అభ్యర్థికి ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలిఅనిల్ కుమార్, జనార్ధన్‌గౌడ్, జడ్పీటీసీ శంకర్‌నాయక్,బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శివాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ పేరుతో బీజేపీ మోసాన్ని గుర్తించాలి'

లింగంపేట, ఏప్రిల్15: ఎస్సీ వర్గీకరణపేరుతో బీజేపీ ప్రభుత్వం గత 10సంవత్సరాలుగా మాదిగలను మోసం చేస్తోందని, దళితులందరూ దీన్ని గుర్తించాలని ఎంఆర్‌పీఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు చిట్యాల సాయన్న పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. మోదీ, మందకృష్ణ మాదిగలు కలిసి మాదిగలను మోసం చే స్తున్నారని తెలిపారు. ఇటీవల మోదీ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెడతానని చెప్పారని, ఇప్పుడు కమిటీ వేస్తానని కాలయపన చేసి మాదిగల ఓట్లు దండుకునేందుకు కుట్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్ర భుత్వం, టీడీపీలు మూడు కమిటీలు వేసి కాల యపన చేశాయని ఆయన విమర్శించారు. బీజేపీ ఓట్ల కోసం మాదిగల ఇంటికి వస్తే తరమి కొట్టాలని ఆయన సూచించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు



తలవదలతవద

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 15: 'లీకేజీలపై నిర్లక్ష్యం' అనే శీర్షిక 'ఆంధ్రజ్యోతి' సోమవారం ప్రచురితమైన కథనానికి ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు స్పందించారు. 11వ వార్డులో జరుగుతున్న లీకేజీలను పరిశీలించి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో లీకేజీలు లేకుండా మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. ఆయనతోపాటు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులు పరిశీలిస్తున్న అధికారులు

కూలీలు కొలతల ప్రకారం పనులు చేయాలి

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్15: ఉపాధిహామీలో పనిచేస్తున్న కూలీలు కొలతల ప్రకారం పనులు చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్ సూచించారు. సోమవారం మండలంలోని వడ్లం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలు ఉదయం పనికి తొందరగా వెళ్లి, కొలతల ప్రకారం పనులు చేసి తొందరగా ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. కొలతల ప్రకారం పనులు చేసినట్లయితే తగిన వేతనం వస్తుందని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలు ఉదయం 6 గంటలకు చేరుకని 10 గంటల వరకు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో సుదర్శన్, టీఏ అమర్, పీల్డ్ అసిస్టెంట్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బీరయ్య దేవుని కల్యాణం

రామారెడ్డి, ఏప్రిల్15: వైభవంగా బీరయ్య దేవుని కల్యాణ మహోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో బీరయ్య దేవుని కల్యాణ మహోత్సవంలో సోమవారం పంతుళ్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్ జిలాల గొర్రెలు, మేకల సహకార సంఘం అధ్యక్షుడు మార్కంటి భూమన్న మాట్లాడుతూ మాకుర కులదైవం బీరయ్య దేవుడికి ప్రతి ఐదేళ్లకొక్కసారి బీరప్ప పండుగను ఘనంగా 9 రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేకంగా ఒగ్గుకథలు, గావుబోనాలు తీసి ప్రతీ కుటుంబం బంధువులు కలిసి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ బెల్లపు చంద్రన్న, రామారెడ్డి మండల గొర్రెల మేకల సహకార సంఘం మండల అధ్యక్షుడు పాల మలేష్, ఎల్లారెడ్డి కురుమసంఘం అధ్యక్షుడు బీరన్న, తాడ్వాయి మండల అధ్యక్షుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు వార్డులకు కమిటీ అధ్యక్షుల ఎన్నిక

ఎల్లారెడ్డి, ఏప్రిల్15: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాటాకుల వినోద్‌గౌడ్, సీనియర్ నాయకులతో కలిసి సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని 5, 6, 9 వార్డులలో వార్డు అధ్యక్షులను, కార్యదర్శుల కమిటీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ గయాజుద్దీన్, చెన్న లక్ష్మణ్, ఆజార్ ఖాద్రి, సతీష్, మహేష్, ప్రశాంత్, సందీప్, భూమయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్15: మద్నూర్ మండలం సలాబత్‌పూర్‌లో గల హనుమాన్ జయంతి ఉత్సవాల కు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావ్‌కు హాజరు కావాలని సోమవారం ఆలయ ఈవో పద్మ శ్రీధర్ ఆహ్వాన పత్రికను అందజేశారు. ప్రతీసంవత్సరం హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో ఉత్సవాలు నిర్వహించే ఆనవాయితీ ఉండగా, ఈ సారి జరిగే ఉత్సవాలకు ఎమ్మెల్యే హాజరు కావాలని ఈవో ఆహ్వాన పత్రికను అందజేశారు.

బీజేపీలో పలువురి చేరిక

పిట్లం, ఏప్రిల్ 15: మండల కేంద్రంలోని గుండుతండాలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు సోమవారం జహిరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలో చేరారు. తండా వాసులకు ఎంపీ బీబీ పాటిల్ పార్టీ కండావాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో కేంద్రంలో మరొక మారు 400పై ఎంపీ స్థానాలతో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోని రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, మండల అధ్యక్షులు అభినయ్‌రెడ్డి, అశోక్‌రాజ్, శివకుమార్, జగదీష్, బీజేపీ నాయకులు ఉన్నారు.

ఎల్లారెడ్డి: పట్టణకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఎంపీ బీబీ పాటిల్ సోదరుడు ఎంబీ పాటిల్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి మండలంలోని మౌలాన్ ఖేడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మరాఠి పోచయ్య, మైపాల్, సాయిలు, భూమయ్య, మరాఠి సాయిలు, నలుగురు నాయకులకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింలు, నరేష్ పీకే, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర కరపత్రాల ఆవిష్కరణ

ఎల్లారెడ్డి: ఈనెల 23న వీరహనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్ర పట్టణకేంద్రంలోని భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ సభ్యుల ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాల వివరాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వహిందూ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు, సభ్యులు వినోద్, నవీన్, కిషన్; తులసీదాస్, లోహిత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్15: జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ ఆధ్వర్యంలో బిచ్కుంద మండలం వాజీద్‌నగర్, మద్నూర్ మండలం కొడిచిర గ్రామాలకు పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిని వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారెంటీ పథకాలతో పాటు, సీఎం రేవంత్‌రెడ్డి పాలనకు ఆకర్షితులమై పార్టీలో చేరామని తెలిపారు. రానున్న రోజులలో జహీరాబాద్ ఎంపిగా సురేష్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వాజిద్ నగర్ ఎంపీటీసీ సాయిలు, మాజీ సర్పంచ్ గుండ భూమయ్య, నాయకులు గోపాల్ రెడ్డి, జిపి సభ్యులు బండి రమేష్, గుండ పండరి, చెవుల వార్ గంగు, కుమ్మరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో..

గాంధారి: ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో యాదవ సంఘం సభ్యులు చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న అందరికీ సముచితస్థానం కల్పిస్తామని తెలిపారు. తనపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ప్రతిఒక్కరికీ తనవంతు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా నాయకులు బాలాఅర్జున్ గౌడ్, భాగ్యనాయక్, యాదవసంఘం సభ్యులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

'బీజేపీ గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు పనిచేయాలి'

బిచ్కుంద: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార అన్నారు. మండలకేంద్రంలో ఆమె ఇంటింటికీ తిరిగి కమలానికి ఓటేసి బీబీపాటిల్‌ను గెలిపిద్దామని ప్రచారం నిర్వహించారు. సోమవారం బూత్‌సంపార్క్ అభియాన్‌లో భాగంగా మండల కేంద్రంలోని 122, 123 బూత్‌లలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దేశాభివృద్ధికి కృషిచేయడంతోపాటు అనేక ప్రజాప్రయోజనాల పథకాలు అమలు చేస్తూ ప్రపంచదేశాలతో దీటుగా భారతదేశాన్ని అన్ని రంగాలలో పోటీ పడేలా చేస్తు న్నారని తెలిపారు. కమలం గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థిస్తు ప్రతి ఒక్కరు బీజేపీ పాలన కోరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్‌పంతులు, మల్లు దేశాయ్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ హయాంలోనే దేశ అభివృద్ధి సాధ్యం..

పెద్దకొడప్‌గల్: దేశ అభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యం అవుతుందని బీజేపీ మండల అధ్యక్షులు బాలాజీ పటేల్ పేర్కొన్నారు. సోమవారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంజనీ, టికారం తండాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ పటేల్ మాట్లాడుతూ మోదీ ప్రధాని అయిన తర్వాతే దేశం అభివృద్ధి చెందుతోందని అన్నారు. గత కాంగ్రెస్ పరిపాలనలో దేశ ప్రగతి కుంటుపడిందని అన్నారు. దేశం ఇంకా అభివృద్ధి బీజేపీ ఓటువేసి మోదీని తిరిగి ప్రధాని చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంజయ్ పటేల్, ప్రేమ్‌సింగ్, దర్మేందర్, రామాగౌడ్, సుభాష్, మశ్చందర్ తదితరులు పాల్గొన్నారు.

బీబీ పాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి..

ఎల్లారెడ్డి, ఏప్రిల్15: పార్లమెంట్ ఎన్నికల్లో బీబీ పాటిల్ గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు పని చేయాలని, ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను బీబీ పాటిల్ చేసిన అభివృద్ధిని ప్రతీ గ్రామంలో ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ రవీంద్రరావు అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బూత్‌స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పది సంవత్సరాల కాలంలో బీబీపాటిల్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఇతర పార్టీల మాటలను ప్రజలు నమ్మరని మూడోసారి ప్రధాని కావాలని ప్రజలు నిర్ణయించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో లింగారావు, మండల అధ్యక్షుడు నర్సింలు, ప్రధాన కార్యదర్శి నరేష్, నాయకులు సతీష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకుందాం'

బీర్కూర్, ఏప్రిల్15: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ శ్రేణులు అందరూ కలిసికట్టుగా పని చేసి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన బీర్కూర్ మండల కేంద్రానికి విచ్చేశారు. పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఆయన సమక్షంలో బీర్కూర్ గ్రామకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుపు కోసం శ్రమించిన వారికి భవిష్యత్తులో పార్టీ పదవుల్లో తగిన ప్రాధాన్యం ఇస్తామన్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు గ్రామగ్రామాన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కమిటీ సభ్యులు పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంత్‌రెడ్డి, చందు, గంగారాం పాల్గొన్నారు.

వార్డుల్లోని సమస్యలను పరిష్కరిస్తా..

బాన్సువాడటౌన్: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని బాన్సువాడ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన 14వ వార్డులో పర్యటించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నార్ల నందకిశోర్, నార్ల రాఘవేందర్, కొత్తకొండ భాస్కర్, కార్యకర్తలు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే సతీమణి మృతి

మద్నూర్, ఏప్రిల్15: మద్నూర్ మండలానికి చెందిన జుక్కల్ మాజీ శాసన సభ్యులు నాగ్‌నాథ్ సేట్ తమ్మేవార్ సతీమణి సులోచన (97) అనారోగ్యంతో మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. జుక్కల్ నియోజకవర్గానికి 3వ ఎమ్మెల్యేగా ఉన్న స్వర్గీయ నాగ్‌నాథ్ సేట్ తమ్మేవార్ సతీమణి కర్ణాటకలోని హుమ్నాబాద్‌లో అనారోగ్యంతో మృతిచెందినట్లు తెలిపారు. అంత్యక్రియలు హుమ్నాబాద్‌లో జరుగుతాయని వెల్లడించారు. అలాగే మద్నూర్ మండల కేంద్రానికి చెందిన మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ నక్కావార్ లక్ష్మణ్ అనారోగ్యంతో మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

ముదిరాజ్ సంఘం కార్యవర్గం ఎన్నిక

దోమకొండ, ఏప్రిల్15: మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మద్దుల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పెద్దమద్దుల పోశయ్య, ప్రధాన కార్యదర్శిగా నీల బస్వయ్య, సహాయ కార్యదర్శిగా వాడే మధు, కర్రోల్ల సత్యం, మద్దుల గంగయ్య, నీల నరేష్, కోశాధికారి దసరి భూమయ్య, సలహదారులు పెద్దమద్దుల రాజు, వాడే శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించిన బీబీ పాటిల్



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీబీ పాటిల్

బీర్కూర్, ఏప్రిల్ 15: జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ శ్రేణులతో మాట్లాడారు. కేంద్రపథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. గడపగడపకు తిరగాలని, మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర నాయకుడు యెండల లక్ష్మీనారాయణ, సాయికిరణ్ తదిత రులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

గాంధారి, ఏప్రిల్15: మండల కేంద్రంలోగల సోయక్ పాషా ఇంటిలో దొంగతనానికి పాల్పడిన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి గ్రామానికి చెందిన నిందితుడు వల్లెపు కాశీరాంను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. బాన్సువాడలోని అతని మామ ఇంట్లో ఉన్న కాశీరాంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద గల దొంగిలించిన సొమ్మును, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకుని నేరస్తుడైన కాశీరాంకు జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి




కామారెడ్డి

- దర్శన్ - లవ్‌గురు
- శాంతి - టిల్లు స్క్వేర్
- ప్రియా 70 - ది ఫ్యామిలీ స్టార్
- ప్రియా 35 - గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ

- మహేశ్వరి - ది ఫ్యామిలీ స్టార్
- వెంకటేశ్వర - లవ్‌గురు

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	180	200	220
వెన్‌కాబ్(కిలో)	190	220	230

